క్లుప్తంగా

ఆలయానికి రూ.లక్ష విరాళం



అమ్మవారికి పూజలు చేస్తున్న వంశీధర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి కోసం కేవీఆర్ ఫౌండేషన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల వంశీధర్ మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహాభిషేకం, లక్ష పుష్పార్చన చేశారు. అర్చకులు, నిర్వాహకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

లింగార్షక బుట్ట.. పంటకు రక్ష



రైతులకు లింగార్షక బుట్టలు అందజేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): లింగార్షక బుట్ట పంటకు రక్ష అని వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. మండలంలోని చాట్లపల్లి రైతు వేదికలో మారి సంస్థ, ఎల్ఈడీ జాగృతి ఆధ్వర్యంలో మంగళవారం 150 మంది రైతులకు ఉచితంగా లింగార్షక బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బుట్టలతో పత్తిపంటలో గులాబీ, లద్దె పురుగులను నివారించవచ్చన్నారు. మోతాదుకు మించి ఎరువులు వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణమూర్తి, సంస్థ జిల్లా ఇన్‌చార్జి రాజు, యూనిట్ మేనేజర్ రాజేందర్, ఫీల్డ్ అధికారులు రమేశ్, వెంకటేశ్, కరుణకర్, రమాదేవి, మౌనిక, బాలకృష్ణ పాల్గొన్నారు.

యూరియా అందించండి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల నాయకులు కార్యకర్తలతో కలిసి మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు యూరియాను అందించడంలో విఫలమయ్యాయన్నారు. అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో యూరియా లభించడం లేదని వాపోయారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రవీందర్, కష్టారెడ్డి, ఇస్తారి, బాలకిషన్, సాయిలు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం



నిల్వ నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

జగదేవ్‌పూర్(గజ్వేల్): వర్షాల వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సత్యప్రకాశ్ అన్నారు. మండలంలోని దౌలాపూర్‌లో ప్రజలకు మంగళవారం పరసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిలిచిపోకుండా చూసుకోవాలని సూచించారు. మురుగు గుంతల్లో ఆయిల్ బాల్స్ వేశామని, జ్వరాలు సోకితే వెంటనే ఆస్పత్రికి రావాలని కోరారు. వైద్య సిబ్బంది జితేందర్‌రెడ్డి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాడీ ఫ్రీజర్ అందజేత



బాడీ ఫ్రీజర్ అందజేస్తున్న నాయకులు

హుస్నాబాద్: గ్రామానికి తమ వంతు సహకారం అందిస్తామని పద్మశాలి బంధుమిత్ర పాదుపు సంఘం నాయకులు అన్నారు. సంఘం పక్షాన మంగళవారం రూ.లక్షల విలువగల బాడీ ఫ్రీజర్‌ను మున్సిపల్‌లో అందజేశారు. వారు మాట్లాడుతూ ఎవరైనా చనిపోతే వారి పార్థివదేహాన్ని భద్రపర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్న వారి కోసం ఈ ఫ్రీజర్ ఉపయోగపడుతుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సంఘ నాయకులు సత్యనారాయణ, రాజయ్య, ప్రభాకర్, లక్ష్మీపతి, నాగభూషణం పాల్గొన్నారు.

31న రేషన్ డీలర్ల ఎన్నిక

సిద్దిపేటజోన్: జిల్లా రేషన్ డీలర్ల అసోషియేషన్ ఎన్నికలు 31న ఉంటాయని ఎన్నికల అధికారి వెంకటేశం తెలిపారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం 11 మందితో ఎన్నికల నిర్వహణ కమిటీ నియమించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి స్థానాలకు ఎన్నిక జరుపుతున్నామని, ఆసక్తి ఉన్న వారు పోటీ చేయాలని కోరారు. 22లోగా నామినేషన్లు అందజేయాలన్నారు. మొనయ్య, శంకర్, రమేశ్, నరేందర్ స్వామి, తిరుపతి, నాగరాజు, రాజు, లక్ష్మణ్, పరశురాములు పాల్గొన్నారు.

వేలాడుతున్న యమపాశాలు
జర పైలం



చెట్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పొలాల మధ్యనే ట్రాన్స్‌ఫార్మర్లు

- అప్రమత్తతలేకపోతే అంతే సంగతులు
- షాక్‌కు గురవుతున్న రైతులు, పశువులు

దుబ్బాకరూరల్: వర్షాకాలం వచ్చిందంటే విద్యుత్ తీగలతో రైతులు జాగ్రత్తగా ఉండాలి. చాలా చోట్ల పొలాల వద్ద ఉన్న విద్యుత్ స్తంభాల నుంచి తీగలు కింది వేలాడుతుంటాయి. వాటి సపోర్టు వైర్లు గడ్డిలోనో, మట్టిలోనో కనపించకుండా ఉంటాయి. అలాగే కొన్ని చోట్ల పొలాల్లో ట్రాన్స్ ఫార్మర్లు కూడా ఎటువంటి కంచె లేకుండా అపాయకరంగా ఉన్నాయి. ఈ క్రమంలో వానాకాలంలో మరింత అన్నదాతలు మరింత అప్రమత్తంగా ఉండాలి.

పొలం మధ్యే ట్రాన్స్‌ఫార్మర్లు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు పొలాల మధ్యనే ఉండటం వల్ల కొంత మంది రైతులు తమ పొలాలను సాగు చేయకుండా వదిలేశారు. విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వాటి విషయాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో వర్షాకాలంలో విద్యుత్ షాక్‌కు గురై చాలా మంది రైతులు మరణించిన సందర్భాలు ఉన్నాయి. బోర్ బావుల వద్ద స్టార్టర్ డబ్బాలను సరి చేస్తుండగా, పొలం దున్నుతుండగా, గట్లు చెక్కుతుండగా షాక్ తగిలి అన్నదాతలు మరణించిన ఘటనలు చాలానే ఉన్నాయి.

పశువులు మృత్యువాత

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు వైర్లు తగిలి షాక్‌తో పశువులు మృతి చెందుతున్నాయి. అదే విధంగా మొక్కజొన్న పంటలకు ఇతర ఆరుతడి పంటలకు అడవి పందులు ఇతర జంతువులు బారినుంచి పంటలను కాపారుకోడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలతోను ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



దారికి అడ్డంగా తెగిపడిన విద్యుత్ తీగలు

ట్రాన్స్‌ఫార్మర్ తొలగించండి



మా పొలంలో పదేళ్లుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. పొలం దున్నుతుండగా వైర్లు తగలడంతో చాలాసార్లు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న స్థలంలో వరినాట్లు వేయకుండా వదిలేశాం. పొలం మధ్యలో ఉన్న ఆ ట్రాన్స్‌ఫార్మర్ నిత్యం భయపెడుతోంది. దానికి అక్కడి నుంచి తొలగించాలని చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– తోర్నాల స్వామి, రైతు

జాగ్రత్తగా ఉండాలి..



వర్షాకాలంలో రైతులు విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలి. వర్షాలు కురుస్తున్న సమయంలో బోరుబావుల వద్ద స్టార్టర్ డబ్బాలను ముట్టుకోకూడదు. ఎక్కడైనా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల నుంచి వైర్లు కిందికి వాలి ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. సొంత మరమ్మతుల చేయడం ప్రమాదకరం. పంటల కోసం విద్యుత్ తీగలు అమర్చవద్దు. పశువులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలి.

– కనకరాజు, విద్యుత్ ఏఈ



పీహెచ్‌సీ భవనంలో కొనసాగుతున్న మరమ్మతు పనులు

ఆస్పత్రి అభివృద్ధికి నిధులు

కొనసాగుతున్న మరమ్మతు పనులు

సాక్షి ఎఫెక్ట్

జగదేవ్‌పూర్(గజ్వేల్): షార్టు సర్క్యూట్‌తో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన మండల పరిధిలోని తిగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరమ్మతుల కోసం అధికారులు నిధులు కేటాయించారు. ఈ విషయంపై గత నెల 22న సాక్షిలో 'అంధకారంలో హాస్పటల్' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ స్పందించి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. దీంతో మరమ్మతుల కోసం ప్రత్యేక నిధుల కింద రూ.36 లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరు కావడంతో వారం రోజులుగా ఆస్పత్రిలో మరమ్మతు పనులు ప్రారంభించారు. నూతన విద్యుత్ కనెక్షన్, భవనం పైకప్పుతో పాటు తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లకు మరమతులు చేపట్టినట్టు పంచాయతీరాజ్ ఏఈ రాకేశ్ మంగళవారం తెలిపారు. ఆస్పత్రికి వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని చెప్పారు.

జ్వర పీడితుల సర్వే చేపట్టండి

వైద్యాధికారి ధనరాజ్

నంగనూరు(సిద్దిపేట): కురుస్తున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది ఊరూరా జ్వర పీడితుల సర్వే చేపట్టాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్యాధికారి ధనరాజ్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని రాజగోపాల్‌పేట, గట్లమల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల రాకపోకలు నిలిచిపోయే గ్రామాల్లో అవసరమయ్యే ముందులను ముందస్తుగా అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రజలను అప్రమత్తం చేయాలని, తగిన సూచనలు ఇవ్వాలని చెప్పారు.

కూడవెల్లి వాగుకు జలకళ

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మల్లన్నసాగర్ నిండినప్పుడల్లా కూడవెల్లి వాగుకు జలకళ సంతరించుకుంటుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పొంగి ప్రవహిస్తున్న కూడవెల్లి జలాలకు మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూడవెల్లి నుంచి పారే ఈ సాగునీరే అప్పర్ మానేరు, లోయర్ మానేరు, మిడ్ మానేరు నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా భూములను సస్యశ్యామలం చేస్తాయన్నారు. చెక్ డ్యాంలతో జీవనదిలా కూడవెల్లి పారుతుందంటే కాళేశ్వరం ఫలితమేనన్నారు. మిరుదొడ్డి, తొగుట, భూంపల్లి, దుబ్బాక మండలాలకే కాకుండా కామారెడ్డి జిల్లాలోని బిక్నూర్, దోమకొండ మండలాలలోని సాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సతీశ్‌రెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రవి, పరశురాములు, సురేశ్ తదితులు పాల్గొన్నారు.



కూడవెల్లి వాగుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

నీళ్లు మొక్కుబడిగా వదలొద్దు..

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం

సిద్దిపేటజోన్: రైతుల గోస విని సాగునీరు విడుదల చేయాలని, మొక్కుబడిగా మోటారు ఆన్ చేయొద్దని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వానికి సాగునీటి వృథాపై లేఖ రాయడం, రైతులతో కలిసి మోటార్లు ఆన్ చేయాల్సి వస్తుందని హెచ్చరికలు చేసిన నేపథ్యంలో సాగునీటి విడుదల జరిగిందన్నారు. మూడు పంపులను ఆన్ చేయకుండా కేవలం ఒకే పంపు ద్వారా నీటిని విడుదల చేస్తున్నారని ఆరోపించారు. భేషజాలకు పోకుండా నీళ్లు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి యాదవ్, సోమిరెడ్డి, రమేశ్, ఈర్షద్, యాదగిరి శ్రీకాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

కొమురవెల్లి(సిద్దిపేట): యూరియాను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ దివ్య హెచ్చరించారు. కలెక్టర్ హైమావతి ఆదేశానుసారం మండలంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. దుకాణాదారులు రైతులకు మాత్రమే యూరియా విక్రయించాలని సూచించారు. రైతులకు యూరియా విషయంలో ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు.

నానో యూరియా ఎంతో మేలు

దుబ్బాకటౌన్: రైతులు నానో యూరియా వైపు మొగ్గు చూపాలని తహసీల్దార్ సంజీవ్ కుమార్ సూచించారు. దుబ్బాకలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా, నకిలీ విత్తనాలు, రసాయనాలను విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటి వరకు దుబ్బాకలో దాదాపు 820 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశామని ఏఓ తెలిపారు.

నిబంధనలు పాటించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంతో పాటు, మన గ్రోమోర్ ఎరువుల దుకాణాలలో తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్ తనిఖీలు నిర్వహించారు. ఎరువుల అమ్మకాల వివరాలను పరిశీలించారు. ఎరువుల విక్రయాలల్లో నిబంధనలను పాటించాలని డీలర్లను ఆదేశించారు.



కొమురవెల్లిలోని ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న వెంకట్రావమ్మ, దివ్య

880 మెట్రిక్ టన్నుల అమ్మకాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ నిర్మల, ఏఓ వసంతరావు కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశామని, మండలంలోని ఇప్పటి వరకు 880 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిగాయని చెప్పారు. ఇంకా 55 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందన్నారు. యూరియాను పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంచడంలో అధికారులు విఫలం

దౌల్తాబాద్(దుబ్బాక): యూరియా కొరత తీర్చాలని మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా వద్ద వివిధ గ్రామాలకు చెందిన రైతుల మంగళవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియాను అందుబాటులో ఉంచడంలో వ్యవసాయ అధికారులు విఫలమయ్యారన్నారు. రెండు బస్తాల యూరియా కోసం ప్రతిరోజు ఎరువుల దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ అక్కడికి వెళ్ళి రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే రైతులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడ చేరుకుని రైతులతో మాట్లాడారు. రైతులకు యూరియా అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఆరుగురికి పీహెచ్‌డీ పట్టాలు అందజేత

ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణన్, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ మొగులారపు కుమార్‌ల చేతుల మీదుగా మంగళవారం జిల్లాలోని పలువురు పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు.

కొండపాక(గజ్వేల్)/నంగనూర్(సిద్దిపేట)/గజ్వేల్ రూరల్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): కొండపాక మండల మాజీ జెడ్పీటీసీ అనంతుల అశ్విని బిజినెస్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టులో పట్టా పొందారు. ఆమె ఉస్మానియా యూనివర్సిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టు బోధకురాలిగా పని చేస్తున్నారు. అలాగే నంగునూరు మండల పరిధిలోని అక్కెనేపల్లికి చెందిన పిడిశెట్టి సదానందం, గజ్వేల్‌కు చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిన నర్సింహులు, సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న గజ్వేల్‌కు చెందిన సిరినేని స్వప్న, మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన జంగిటి కమలాకర్ అలాగే జిల్లా కేంద్రానికి చెందిన బామండ్ల రాజు పట్టాలు పొందారు. రాజు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు.



కొండపాక మాజీ జెడ్పీటీసీ అశ్వనికి పీహెచ్‌డీ పట్టా అందజేస్తున్న ఓయూ వీసీ కుమార్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతిఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్రూం కాలనీలో మంగళవారం పర్యటించారు. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్‌ను శుభ్రపర్చాలని, కాలనీలో ఇసుక సంచులు, మట్టి కుప్పలను వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించారు.

అందుబాటులో ఉండాలి

సిద్దిపేటజోన్: మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు వార్డుల్లో అందుబాటులో ఉండాలని ఆశ్రిత్‌కుమార్ ఆదేశించారు. పురాతన ఇళ్లలో నివాసం ఉన్నవారు ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఏ సమస్యలు ఉన్నా నంబర్ 9505507248ను సంప్రదించాలని చెప్పారు. అలాగే లోయర్ మానేరు డ్యామ్‌కు మరమ్మతులు చేస్తున్నందువల్ల బుధవారం కొన్ని ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఆశ్రిత్‌కుమార్

జాకీలొచ్చాయి.. గురూ!

సిద్దిపేటకమాన్: పట్టణంలో ఓ పాత భవనాన్ని జాకీలతో సాయంతో పైకిలేపి నూతనంగా నిర్మించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. సిద్దిపేట కు చెందిన ఆరుట్ల యాదవరెడ్డి 15యేళ్ల క్రితం లింగారెడ్డిపల్లి మార్గంలో ఇల్లు నిర్మించుకున్నాడు. ఆ మార్గంలో పలు మార్లు నూతనంగా రోడ్డు వేయడంతో ఆ భవనం రోడ్డుకు రెండు అడుగుల కిందకి చేరింది. జాకీల సాయంతో ఇంటిని పైకి ఎత్తవచ్చనే విషయం తెలుసుకొని వారిని సంప్రదించాడు. దీంతో ఆ కన్స్ట్రక్షన్‌కు చెందిన భవనాన్ని సుమారు వంద జాకీల సాయంతో నాలుగు అడుగుల పైకి లేపా రు. పునాది ఫిల్‌చేసి వారం, పది రోజుల్లో మిగిలిన పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.



భవనాన్ని పైకి లేపడానికి అమర్చిన జాకీలు

సంక్షిప్త వార్తలు

◆ **రైతులను రెచ్చగొడుతున్న హరీశ్‌రావు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో యూరియా కొరత ఉందని ఎమ్మెల్యే హరీశ్‌రావు రైతులను రెచ్చకొడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బొమ్మల యాదగిరి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో యూరియా కొరత లేకపోయినా కొరత ఉందని బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు కరీమొద్దిన్, షాబొద్దిన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **మల్లేశం పోరాటం మరువలేనిది**

హుస్నాబాద్: పెత్తందారుల అరాచకం కొనసాగుతున్న రోజుల్లో హుస్నాబాద్ ప్రాంతంలో పాటలతో అన్యాయాన్ని ఎదిరించిన గూడూరి మల్లేశం పోరాటం మరువలేనిదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు గూడూరి(మేర) మల్లేశం 29వ వర్ధంతి కార్యక్రమాన్ని జనజాగృతి కళా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మల్లేశం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మల్లేశం కూతురు అమరావతి, సంపత్ కుమార్, రవీందర్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **వేతనాలు చెల్లించాలని వినతి**

సిద్దిపేటకమాన్: ఆశా వర్కర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ సహాయ కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. సిద్దిపేట అంబేడ్కర్ నగర్ పీహెచ్‌సీ ఆశా వర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు.

◆ **ఘనంగా ఏకాదశి పూజలు**

గజ్వేల్‌రూరల్: శ్రావణమాసం చివరి మంగళవారం ఏకాదశి పర్వదినం సందర్భంగా వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు శేషం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే ఆర్యవైశ్య భవన్‌లో శ్రావణమాసం సందర్భంగా శివపార్వతుల కల్యాణం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, మహిళలు పాల్గొన్నారు.

◆ **వైభవంగా ఆర్ద్రా మహోత్సవం**

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలోగల విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం ఆర్ద్రా మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. నిర్వాహకుడు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు విఠల్, మల్లేశం, రాజేంద్రప్రసాద్, రవీందర్, శ్రీశైలం, రాంచంద్రారెడ్డి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

◆ **వరదలపై అప్రమత్తం: ఏసీపీ**

వర్గల్(గజ్వేల్): చెరువులు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ నర్సింహులు సూచించారు. మండలంలోని అంబర్‌పేట ఖాన్‌చెరువు వద్ద రోడ్డుపై నిలిచిన వరదనీటిని మంగళవారం ఆయన పరిశీలించారు. స్థానిక సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డిలతో పరిస్థితిని సమీక్షించారు. రాకపోకలకు ఇబ్బంది కలిగితే స్థానిక పోలీసుల సమాచారమివ్వాలని సూచించారు.

◆ **వైద్య అధికారుల పరిశీలన**

నంగనూర్(సిద్దిపేట): మండల పరిధిలోని ముండ్రాయి గ్రామ ఎస్సీ కాలనీని జిల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాల అధికారి డాక్టర్ రేవతి మంగళవారం సందర్శించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని చెప్పారు.

◆ **యూరియా కొరత అవాస్తవం**

చిన్నకోడూరు(సిద్దిపేట): నియోజకవర్గంలో యూరియా కొరత ఉందని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా ఉందని, కొరత ఉందనడం అవాస్తవమన్నారు. పరశురాములు, రాజేశ్, ప్రశాంత్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

◆ **ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం**

హుస్నాబాద్/చిన్నకోడూరు(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. ఆయా మండలాల్లోని ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు కెమెరా సృష్టికర్త లూయిస్ మండే డాగురే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాలలో రాజు, రాజ్‌కుమార్, శ్రీకాంత్, సురేశ్, మహేశ్, లక్ష్మణ్, సీనియర్ ఫొటో గ్రాఫర్‌లు దాసరి చంద్రం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమలు ఎప్పుడు?

ఆశా వర్కర్స్ యూనియన్ నేత మంజుల

దుబ్బాక: రాష్ట్రంలో ఆశావర్కర్లకు రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం ఎప్పుడు అమలు చేస్తా రని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల ప్రశ్నించారు. తిమ్మాపూర్, రామక్కపేట పీహెచ్‌సీల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం మెడికల్ అధికారులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పూర్తిచేసిన ఆశా వర్కర్లకు జీఎన్ఎం, ఏఎన్ఎం ఉద్యోగాలు ఇవ్వాలన్నా రు. నేటికీ జూలై నెల వేతనాలు రాలేదని వాపోయారు. రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులతోపాటు అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్యామల, భాగ్యలక్ష్మి, సంతోష, శారద, పద్మ, విజయ, అనిత, భారతమ్మ, లత, శోభ తదితరులు పాల్గొన్నారు.